క్లుప్తంగా

క్షయ నిర్ధారణ పరీక్షలు



నవీపేట: మండల కేంద్రంలోని క్లస్టర్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. జాతీయ క్షయ వ్యాధి నివారణలో భాగంగా నిర్వహిస్తున్న సైటీబియా పరీక్షలో క్షయవ్యాధిని నిర్ధారణ చేయవచ్చని మెడికల్ ఆఫీసర్ కావ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు. 55 మందికి మొదటి విడతగా ఈ పరీక్షలు నిర్వహించామని ఆమె పేర్కొన్నారు. సూపర్‌వైజర్లు కిషన్, గోదావరి, స్టాఫ్ నర్స్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడమే షీటీం ధ్యేయం



రుద్రూర్: మహిళలు, పిల్లలకు రక్షణ కల్పించాలనే దృక్పథంతో షీటీమ్ పని చేస్తుందని బోధన్ డివిజన్ షీటీం సభ్యులు విజయ్ కుమార్, సునయన అన్నారు. రుద్రూర్ మండలంలోని ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం షీటీం పనితీరు గురించి అవగాహన కల్పించారు. మహిళ చట్టాలు, టి–సేఫ్ యాప్, డయల్ 100, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, తదితర అంశాల గురించి వివరించారు. కళాశాల డీన్ కల్పన, స్థానిక ఎస్సై సాయన్న, ఏఎస్సై రాజు, మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పడగల్‌లో భీమన్న కల్యాణం



వేల్పూర్: పడగల్ గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున నాయకపోడు సంఘం ఆధ్వర్యంలో భీమన్న కల్యాణం జరిపించారు. డప్పు వాయిద్యాలు, ప్రత్యేక పూజలతో భీమన్న, ఇడుంబికి కల్యాణం జరిపించారు. నాయకపోడు సంఘం అధ్యక్షుడు ముత్తన్న, గంగమల్లయ్య, చిన్నమల్లయ్య, ఊషన్న, ఏదుల కిషన్, భక్తులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి వైశాఖ మాస ప్రత్యేక పూజలు



రుద్రూర్: మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో వైశాఖ మాస ప్రత్యేక పూజలు ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఏడాది వైశాఖ మాసంలో దేవాంగ సంఘం ఆధ్వర్యంలో అమావాస్య వరకు పూజలు నిర్వహిస్తారు. ప్రతి రోజు ఉదయం, రాత్రి పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేస్తారు. రాత్రి వేళ భజనలు, కీర్తనలు కొనసాగుతాయి. ఆఖరి రోజు పట్టు మహోత్సవం, దేవి శోభాయాత్ర, కల్యాణ మహోత్సవం నిర్వహించడం అనవాయితీగా వస్తోందని కమిటీ సభ్యులు వివరించారు.

ఘనంగా పుష్కర బ్రహ్మోత్సవాలు

బోధన్ రూరల్ : పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో పుష్కర బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. మొదటిరోజు సుప్రభాతసేవ, నిత్యారాధన, నివేదన హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



కమ్మర్‌పల్లి: కోనసముందర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన గాయత్రి అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మధుపాల్ తెలిపారు. జిల్లాలోని తిర్మన్‌పల్లిలో అండర్–16 జూనియర్ బాలికల విభాగంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో గాయత్రి పాల్గొని ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. జనగామలో ఈనెల 15 నుంచి 17 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటుందని వివరించారు.

బోధన్ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటాం

బోధన్‌టౌన్(బోధన్): రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బోధన్ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ఎంఐఎం పార్టీ జిల్లా అధ్యక్షులు ఫయాజొద్దీన్ కుండబద్దలు కొట్టి చెప్పారు. పార్టీ నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం రాత్రి పట్టణంలోని మెహర్బా ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. 20 కంటే ఎక్కువ సీట్లు ఎవరి మద్దతు లేకుండా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కమిటీని ఘనంగా సన్మానించారు. నిజామాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మీర్ మజాజ్ అలీ, నాయకులు షమీ, ఖదీర్ పాల్గొన్నారు.

పెరిగిన కోతుల బెడద

- కోతుల భయంతో బయటికి రావాలంటే జంకుతున్న జనం
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న మెండోరా మండల ప్రజలు



మెండోరా మండలం దూదిగాంలో పోస్టాఫీసు వద్ద కోతులు

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాం, మెండోరా, చాకిర్యాల్, పోచంపాడ్ గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. కోతుల బెడద నుంచి తప్పించుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికి మళ్లీ మళ్లీ వస్తున్నాయి. దూదిగాంలో ప్రధానంగా జన సంచార ప్రాంతాల్లోనే ఎక్కువగా కోతులు ఉన్నాయి. పోస్టాఫీస్ వద్ద గోడపై కాపలా మాదిరిగా కోతులు కూర్చుండి ఉండటంతో పోస్టాఫీస్‌కు రావడానికి జనం భయపడుతున్నారు. ఇలా నిత్యం ఏదో ఒక చోట కోతుల బెడద తీవ్రంగా ఉంది. పోచంపాడ్‌కాలనీలో కోతులు మందలు మందలుగా సంచరిస్తున్నాయి. ఇళ్లలోకి కోతులు రాకుండా కాలనీవాసులు వలలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అయినా లోపలికి రావడానికి కోతులు ప్రయత్నాలు చేస్తున్నాయి. గతంలో పోచంపాడ్‌లో కోతుల బెడద తగ్గించుటకు కొండ ముచ్చులను కూడా తీసుకొచ్చారు. కాని గోదావరి తీరం వరకు వెళ్లి మళ్లీ ఇదే కాలనీకి తిరిగి వస్తున్నాయి. గ్రామాల్లో కోతులు విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ తీగలను, టీవీ డిష్ తీగలను ఉంచడం లేదు. కోతుల చేష్టలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాకతీయ కాలువ మెండోరా మండల పరిధిలో ప్రధాన గ్రామాలను ఆనుకుని పోతుంది. దీంతో కోతుల సంచారం కూడా ఎక్కువగా ఉంటోంది. ప్రస్తుతం వేసవి కాలంలో కోతులు నీటి కోసం ఇళ్లలోకి వచ్చి చేరుతున్నాయి. భూముల అభివృద్ధి పేరిట వనాలను నరికి వేయడంతో వనంలో ఉండాల్సిన కోతులు జనంలోకి వచ్చి చేరుతున్నాయి. సరైన ఆహారం లభించకపోవడంతోనే జనావాసాల మధ్యకి వచ్చి ఆహారం కోసం జనాల వెంటపడుతున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి కోతులను బంధించి అడవుల్లో వదిలి వేయాలని ప్రజలు కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందిగా ఉంది

గ్రామంలో కోతుల సంచారం ఎక్కువగా ఉండటం వల్ల కోతులతో తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఇళ్లలోకి వచ్చి చొరబడుతున్నాయి. చేతుల్లో ఏది ఉంటే అది ఎత్తుకెళ్తున్నాయి. కోతులను పట్టి అడవుల్లో వదిలి వేయాలి. – జ్ఞాని, దూదిగాం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ



గంజాయితో పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

ఆర్మూర్‌టౌన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని గ్రంథాలయంలో మంగళవారం విశిష్టపుడమి రత్న జాతీయ అవార్డు గ్రహీత, సామాజిక సేవకుడు పట్వారీ తులసి కుమార్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ హాజరై మాట్లాడారు. గంజాయి, గుట్కా, మద్యపానం, ధూమపానం వంటి మత్తు పదార్థాలు వ్యక్తిగత జీవితానికి, కుటుంబానికి, సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తాయన్నారు. గ్రంథాలయం పాలకురాలు వరలక్ష్మి, పాఠకులు, పోలీసులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

ఆర్మూర్‌టౌన్: గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేష్ అన్నారు. జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు ఎన్‌డీపీఎస్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా సోమవారం రాత్రి ఆర్మూర్ పట్టణంతో పాటు వేల్పూర్ మండల కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. వేల్పూర్ మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న యాళ్ల రిశ్వంత్ వద్ద నుంచి 750 గ్రాముల గంజాయి, నగదు, సెల్‌ఫోన్, అలాగే ఆర్మూర్‌లో అశోక్ సమీర్, అశోక్ కలీమ్ అనే ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 2 కిలోల 300 గ్రాముల గంజాయి, 2 బైకులు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. ఎక్సైజ్ ఎస్సై నర్సింహాచారి, సిబ్బంది భూమన్న, గంగారాం, విష్ణు, సాయికుమార్ పాల్గొన్నారు.

రాజారెడ్డి సేవలు మరవలేనివి



గడ్డం రాజారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు ధన్‌పాల్, పైడి రాకేశ్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ దివంగత మాజీ సర్పంచ్ గడ్డం రాజారెడ్డి సేవలు మరువలేనివని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో మాజీ సర్పంచ్ గడ్డం రాజా రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే ధన్‌పాల్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డితో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ సూర్య నారాయణ మాట్లాడుతూ.. గడ్డం రాజారెడ్డి సర్పంచ్‌గా సేవలందిస్తూనే ఉత్తమ రైతుగా ఉమ్మడి రాష్ట్రంలో ఆదర్శ రైతు అవార్డు అందుకోవడం సైతం విశేషమన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచ్‌గా రాజారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగా రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్దోళ్ల గంగారెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి, సుచరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్(బోధన్): అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతుందని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని 55 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూనే కొత్త పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. గతంలో నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారుల వద్ద కమీషన్‌లు తీసుకుని పథకాలను మంజూరు చేశారని, కాంగ్రెస్ పాలనలో ఆ పద్ధతి లేదన్నారు. రాయితీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను రైతులు వేసుకోవడం వల్ల భూములు సారవంతమవుతాయని పేర్కొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండల ప్రజా పరిషత్, తహసీల్ కార్యాలయాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఎమ్మార్వో, ఎంపీడీవోలు విధుల్లో గైర్హాజరుగా ఉండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నుంచి అధికారులపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సేవలు సమయానికి అందించాలని, కార్యాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై త్వరలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

బోధన్ రూరల్: నియోజకవర్గంలో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు తప్పనిసరిగా అందిస్తామని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎరాజ్‌పల్లి, అందాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లల్లో మొదటి విడతలో సొంత స్థలం ఉండి..ఇల్లు లేని వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అందాపూర్ లో బీజేపీ బోధన్ మండల అధ్యక్షుడు సిర్ప సుదర్శన్.. గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలని కోరుతూ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.



ఎడపల్లిలో ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

అభినందన

రెంజల్(బోధన్): ఏఈపీసెట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి మంచి ర్యాంకు సాధించిన రెంజల్ విద్యార్థి రిషికేశ్‌ను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అభినందించారు. రెంజల్ గ్రామానికి చెందిన ఆసాని రిషికేశ్ మొదటి ప్రయత్నంలో నే 2,834 ర్యాంకు సాధించాడు. మంగళవారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి రిషికేశ్‌ను శాలువాతో సత్కరించాడు. ఉన్నత చదువుల్లో రాణించా లని సూచించారు. రెంజల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



ఆర్మూర్‌లో వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



వర్నిలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మికులు

ఆర్మూర్: తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(టీయూఐసీ) ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఆర్మూర్ పట్టణంలోని దేశాయ్ బీడీ కంపెనీ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ముత్తన్న మాట్లాడుతూ.. మే డే స్ఫూర్తితో కార్మికులు కొట్లాడి 8 గంటల పని దినాన్ని సాధించుకున్నారన్నారు. కానీ దేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత 12 గంటల పని విధానాన్ని అమలు చేయడం సరైంది కాదన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలన్నారు. నాయకులు నిమ్మల నిఖిల్, భద్రయ్య, రమేష్, నారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వర్నిలో సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ

వర్ని: కార్మికులను కష్టాల పాలు చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. సమ్మెలో కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని, సామాన్య ప్రజల ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. జీపీ యూనియన్ వర్ని మండల అధ్యక్షుడు సాయిలు, నాయకులు సాయిచరణ్, పోశెట్టి, రేఖ, సాయవ్వ, లక్ష్మి పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక



మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి

వేల్పూర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభల్లో జరుగకుండా కాంగ్రెస్ నాయకుల ఇళ్లల్లో చేస్తున్నారని డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన వేల్పూర్‌లోని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ స్వగ్రామంలోగాని, ఇతర గ్రామాల్లో గాని ఇందిరమ్మ లబ్ధిదారులను గ్రామసభల్లో ఎంపిక చేశారా? అని ప్రశ్నించారు. బాల్కొండ నియోజకవర్గంలో ముత్యాల సునీల్ కుమార్ అధికారులపై చేస్తున్న ఒత్తిడి వల్ల వారు ధీర్ఘకాళిక సెలవుల్లో వెళ్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని, లేకుంటే బీఆర్ఎస ఆధ్వర్యంలో ప్రజల పక్షాన భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మెండోరా, బాల్కొండ, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల అధ్యక్షులు శేఖర్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఏలియా, దేవేందర్, నాయకులు చౌట్‌పల్లి రవి, రాజాగౌడ్, రేగుల్లరాములు, నోముల రవీందర్, నల్లరమేశ్, కొలిప్యాక శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై ఎమ్మెల్యే ఆరోపణలు అర్థరహితం



వేల్పూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్: కాంగ్రెస్ పార్టీపై, ప్రభుత్వంపై బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, వారి నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని వేల్పూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన వేల్పూర్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి జీపీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారుల సమక్షంలో ఇళ్లులేని నిరుపేద లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేసి కలెక్టర్ ఆమోదానికి పంపించారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడైనా డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని సవాలు విసిరారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన పూర్తికాకుండానే ఆ పథకంపై ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. ఏఎంసీ డైరెక్టర్లు నరేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ రాజేందర్, గ్రామశాఖ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, దామోదర్, శ్రీధర్, ఇంద్రాగౌడ్, రాము ఉన్నారు.

అవకతవకలు లేకుండా పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న అధికారి

పెర్కిట్(ఆర్మూర్): గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని డీఆర్డీవో సాయా గౌడ్ సూచించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్డీవో సాయాగౌడ్ మాట్లాడుతూ.. పథకంలో సాధారణ పనులతో పాటు వ్యక్తిగతంగా లబ్ధి పొందే పండ్ల సాగు, గడ్డి పెంపకం వంటి పనులు చేపట్ట వచ్చన్నారు. డీపీవో నారాయణ, ఎంపీడీవో బ్రహ్మానందం, పూర్వ ఎంపీడీవో సాయిరాం, ఏఈ నితీష్ కుమార్, ఏపీవో సురేష్, ఈసీ ప్రశాంత్, సాంకేతిక సహాయకులు, జీపీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కరెంట్ వైర్లు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్టపై వెలుతురు కోసం స్తంభాలను ఏర్పాటు చేశారు. స్తంభాలకు విద్యుత్ సరఫరా కోసం కరెంట్ వైర్లను లాగారు. కానీ స్తంభాలు నేలమట్టం కావడంతో వాటిని తొలిగించారు. దీంతో కరెంట్ తీగలు బయటకు వచ్చాయి. ప్రస్తుతం ఆ వైర్లు ప్రమాదకరంగా మారాయి. జాగ్రత్తలు తీసుకోకుండా అలాగే వదిలేశారు. పర్యాటకులకు, మూగజీవాలకు కరెంటు షాక్ తగిలే అవకాశం ఉంది. కరెంట్ వైర్లను తొలిగించడమో లేదా స్తంభాన్ని అమర్చడమో వెంటనే చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

సింగిల్ విండోలకు జీలుగ విత్తనాలు

రుద్రూర్: కోటగిరి, రుద్రూర్, పోతంగల్ మండలాలకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలు సరాఫరా చేశారు. పోతంగల్ విశాల సహకార సంఘానికి 50 క్వింటాళ్లు, రుద్రూర్ మండలం రాయకూర్ సింగిల్ విండోకు 10 క్వింటాళ్లు, కోటగిరి విండోకు 30 క్వింటాళ్లు, ఎత్తొండ విండోకు 15 క్వింటాళ్లు, కొత్తపల్లి విండోకు 15 క్వింటాళ్ల చొప్పున సరఫరా చేశారు. వీటి శాంపిల్ తీసుకుని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించినట్టు స్థానిక వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. రిపోర్టు రాగానే సబ్సిడీపై రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

చెక్కు అందజేత

నందిపేట: తల్వేద గ్రామానికి చెందిన గంజల లావణ్యకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.13 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ అందజేశారు. నాయకులు గాదె శ్రీను, గంగయ్య, లోక శ్రీనివాస్ రెడ్డి, మెండు శ్రీకాంత్, మన్నె సాగర్, అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై అవగాహన

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్‌లో మంగళవారం ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. కాలినడకన స్థానిక ప్రజలతో ముచ్చటిస్తూ గ్రామంలో శాంతి భద్రతల గురించి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రజలకు మరింత చేరువకావడానికి, ప్రజల్లో భద్రతా భావం, విశ్వాసాన్ని పెంచడానికి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని ఎస్సై చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాలు కొనసాగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఏఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డొంకేశ్వర్ ఎంపీడీవో బదిలీ

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ ఎంపీడీవో బ్రహ్మానందం బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన నెల రోజులకే ఆయన బదిలీపై ఆర్మూర్‌కు వెళ్లడం గమనార్హం. వచ్చీ రాగానే ఎంపీడీవో బదిలీ కావడంతో మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. కొత్త ఎంపీడీవోగా ఎవరినీ నియమించకపోవడంతో ఎంపీవో లక్ష్మీప్రసాద్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ ఎంపీడీవోను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

కోనో కార్పస్ మొక్కలను తొలగించండి



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో సుందరీకరణలో భాగంగా ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో నాటిన కోనో కార్పస్ మొక్కలను తొలగించాలని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్ డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ బల్దియా కమిషనర్ వెంకట నారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మాట్లాడారు. పర్యావరణానికి హాని కలిగించే మొక్క కొనో కార్పస్ అని, ఈ మొక్క గాలి పీల్చడం వల్ల చర్మ, శ్వాసకోశ, అలర్జీ తదితర సంబంధిత వ్యాధులు వస్తాయని అన్నారు. ఈ చెట్లపై పక్షులు కూడా వాలవన్నారు. తక్షణమే ఈ చెట్లను తొలగించాలని కోరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌చారి, పట్టణ మాజీ అధ్యక్షుడు బాలరాజు, నాయకులు పవన్‌కుమార్, కందికట్ల వాసు, యోగి, రాజు, గౌతం తదితరులు ఉన్నారు.

విద్యావంతుడు ప్రజాప్రతినిధయితే మేలు



చెక్కులను అందజేస్తున్న ఈరవత్రి రాజశేఖర్

ఆర్మూర్‌టౌన్: విద్యావంతుడు ప్రజాప్రతినిధి అయితే ప్రజలకు మేలు జరుగుతుందని, అదేవిధంగా జర్నలిస్టులు సమాజంలోని చెడును వెలికి తీసి ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనంలో మంగళవారం నవనాథపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజశేఖర్ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి లాభాపేక్ష లేకుండా జర్నలిస్టులు సేవా దృక్పథంతో చెడును వెలికి తీసి ప్రభుత్వం దృష్టి తీసుకొస్తున్నారన్నారు. జర్నలిస్టులను రాజకీయ నాయకులు తమ అవసరాలకు వాడుకొని ఆ తర్వాత పట్టించుకోరని విమర్శించారు. ఆర్మూర్‌లోని నవనాథపురం ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ రూ.20 లక్షల చొప్పున ప్రమాద బీమా చేయించి చెక్కులను వారికి అందజేశారు. ఈఆర్ ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్య రంగాలలో తన తండ్రి ఈరవత్రి రాందాస్ పేరుపై సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు రాంప్రసాద్, కొండి రామచందర్, వెంకటేష్, దోమల శ్రీనివాస్, నిట్ శేఖర్, నూకల శేఖర్, క్రాంతి, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సినిమా

వీటీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	రైడ్-2(హిందీ)-10.00, 1.00, 7.25, 10.25, రెట్రో-4.00
స్క్రీన్-2	హిట్-12.30, 3.45, 7.00, 10.15
స్క్రీన్-3	రెట్రో-11.30, 2.55, 6.20, 9.45
స్క్రీన్-4	హిట్-11.30, 2.45, 6.00, 9.15

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,000	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	89,540		

– నిజామాబాద్ బిజినెస్